ప్రజాశక్తి
గురువారం 7 సెప్టెంబర్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

విద్యుత్ చౌర్యంపై ఉక్కుపాదం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2,331 కేసులు
- డొమెస్టిక్ విభాగంలోనే అధికంగా అక్రమాలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విద్యుత్ చౌర్యంపై అధికారులు ఉక్కుపాదం మోపారు. విజిలెన్స్, థెఫ్ట్ స్క్వాడ్ అధికారులు దాడులు నిర్వహిస్తూ అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో జనవరి 2022 నుంచి 2023 సెప్టెంబరు 2వ తేదీ వరకు 2,331 విద్యుత్ చోరీ కేసులు నమోదు చేశారు. దాదాపు రూ.2.58 కోట్ల విలువైన విద్యుత్ చోరీ అయినట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తం 8 కేటగిరీలలో విద్యుత్ చౌర్యం జరిగింది. అన్నింటి కంటే డొమెస్టిక్ విభాగంలోనే అధిక శాతం కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ కేటగిరీలో 1619 కేసులు నమోదు చేయగా రూ.1.54 కోట్ల విలువైన విద్యుత్ దొంగతనానికి గురైందని అంచనాకు వచ్చారు. కమర్షియల్ కేటగిరీలో రూ.76 లక్షల విలువైన విద్యుత్ అక్రమంగా వినియోగించు కున్నారు. విద్యుత్ దొంగతనానికి పాల్పడిన వారిపై దాదాపు 484 కేసులు నమోదు చేశారు. ఇక ఇండస్ట్రీయల్ కేటగిరీలో 21, వ్యవసాయ విభాగంలో 57, అక్వా సర్వీసెస్ కేటగిరీలో 79 చొప్పున కేసులు నమోదు చేశారు. వరుసగా ఇండస్ట్రియల్ విభాగంలో రూ.4.22 లక్షలు, వ్యవసాయ కేటగిరీలో రూ.3.34 లక్షలు, అక్వా సర్వీసెస్ విభాగంలో రూ.12 లక్షల విలువైన విద్యుత్ చౌర్యానికి గురైనట్లు అధికార్లు అసెసెమెంట్ చేశారు. మరో వైపు కాంపౌండింగ్ అమౌంట్ కింద దాదాపు రూ.70 లక్షల వరకు వసూలు చేపట్టారు. ఇదిలా ఉంటే విద్యుత్ చౌర్యం కేసులు గతంతో పోల్చితే తగ్గుముఖం పట్టాయి. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే చట్ట విరుద్ధ చర్యలు పాల్పడుతున్నారు. రూరల్ డివిజన్లలోనే కేసులు అధికంగా వెలుగులోకి వస్తున్నాయి. నూజివీడు డివిజన్ కింద నూజివీడు రూరల్‌తో పాటు తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, చాట్రాయి, నందిగామ డివిజన్ పరిధిలో చందర్లపాడు, పెనుగంజిప్రోలు, వత్సవాయి, చిల్లకలు, గంపలగూడెం, ముసునూరు, జగ్గయ్యపేట పరిధిలో అల్లూరు, (మిగతా 6లో)

బందరులో ఎవరికి వారే...

- వైసిపిలో ఆధిపత్య పోరు
- ఎంపి × ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

వైసిపిలో నేతల మధ్య ఆధిపత్య పోరు తీవ్రతరమైంది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అత్యధిక ఎమ్మెల్యేలతో సఖ్యత కుదరడం లేదు. స్థానిక ఎమ్మెల్యే పట్ల అసంతృప్తిగా ఉన్న నాయకులు, కార్యకర్తలు బాలశౌరి గూటికి చేరడం, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా ఓ ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసుకుని ఎంపి ప్రోత్సహించడం విబేధాలకు దారితీస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో ఎంపీ బాలశౌరి పాల్గొనే కార్యక్రమాలకు కొందరు ఎమ్మెల్యేలు గైర్హాజరు అవుతున్నారు. ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో వైసిపి ఎంపి అభ్యర్థిని మార్చడానికి బాలశౌరిని వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలు వ్యూహరచన చేస్తున్నారు. ఎంపితో వివాదాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. పెడన నియోజకవర్గంలోనూ మంత్రి జోగి రమేష్, జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక గ్రూపుల మధ్య విబేధాలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ విబేధాలతో వైసిపి ద్వితీయ శ్రేణి నాయకుల్లో నైరాశ్యం నెలకొంది.

విబేధాలు ఇలా!

గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో మాజీ మంత్రి కొడాలి నాని, ఎంపీ బాలశౌరి గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంకలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ అనుచరులు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పిఏ గరికపాటి శివపై దాడికి పాల్పడం సంచలనం సృష్టించింది. కొంతకాలం నుంచి ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి మధ్య పలు అంశాల వల్ల విభేదాలు పొడచూపాయి. మచిలీపట్నం ఇనుకుదురుపేట ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి పనులు పరిశీలించడానికి వచ్చిన ఎంపి బాలశౌరిని ఎమ్మెల్యే గ్రూపుకు చెందిన స్థానిక కార్పొరేటర్ అష్ఘర్ అలి నేతృత్వంలో పలువురు అడ్డుకున్నారు. భోగరాజుపట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణానికి యూనియన్ బ్యాంకు ద్వారా అవసరమైన నిధులను ఎంపి బాలశౌరి మంజూరు చేయించారు. స్మారక భవనం నిర్మాణానికి కార్పొరేషన్ నుంచి ఇప్పటికీ అనుమతులు రాలేదు. అధికార కార్యక్రమాల్లోనూ బందరు ఎంపి, ఎమ్మెల్యేలు విడివిడిగా పాల్గొంటున్నారు. అభివృద్ధి కార్యక్రమాల సమీక్షలూ విడివిడిగానే జరుగుతున్నాయి.

పావులు కదుపుతున్న ఎమ్మెల్యేలు

తమ నియోజకవర్గాల్లో ఎంపీ జోక్యం చేసుకోవడాన్ని ఎమ్మెల్యేలు జీర్ణించుకో లేకపోతున్నారు. నియోజకవర్గంలోని మెజార్టీ ఎమ్మెల్యేలు బాలశౌరికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. బాలశౌరిపై అధిష్టానానికి ఫిర్యాదు చేయాలని వీరంతా నిర్ణయించు కున్నట్లు సమాచారం. మచిలీపట్నం ఎంపీ సీటుపై పలు ఊహగానాలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో బందరు ఎంపీగా పోటీ చేయాలని పెనమలూరు ఎమ్మెల్యే కె.పి సారధిని బాలశౌరిని వ్యతిరేకిస్తున్న (మిగతా 6లో)

సాగుకు ఊతం

వత్సవాయిలో పత్తి పంట

- అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో వర్షాలు
- వరి, పత్తి రైతుల్లో ఆనందం
- కృష్ణాలో 311.8 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజుల నుంచి కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు సాగుకు ఊతమిస్తున్నాయి. తీవ్ర వర్షా భావంతో గత కొద్దిరోజులుగా ఎండుతున్న పంటలను చూసి ఆందోళన చెందిన రైతులు ఈ వర్షంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు, పట్టిసీమల నుంచి తగిన మొత్తంలో కాలువలకు సాగు నీరు విడుదలవ్వకపోవడంతో పాటు వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో కాలువల చివరి భూములకు నీరు అందడం గగనంగా మారింది. వరి నాట్లు నత్తనడకన సాగుతున్నాయి. మరోపక్కన నీరు అందక నాట్లు వేసిన పొలాలు ఎండుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాజిల్లాలో వరి 4 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు 15 వేల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉంది. ఇప్పటి వరకు 3,49,398 పంటలు సాగయ్యాయి. మరో 65, 601.35 ఎకరాల్లో పంటలు సాగవ్వాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులులుగా కురుస్తున్న వర్షాలు పంటల సాగుకు ఒకింత ఊతం ఇస్తున్నాయి. నాట్లు పూర్తయిన ప్రాంతాల్లో అవసరాలు తగ్గడంతో కాలువల్లో దిగువ ప్రాంతాలకు నీరు సరఫరా అవుతున్నాయి. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి, కృత్తివెన్నుతో పాటు పలు మండలాల్లో కాలువ శివారు ప్రాంతాల్లోని భూముల్లోనూ నాట్లు వేయడానికి నీరు అందుబాటులోకి వచ్చింది. ఎన్‌టిఆర్ జిల్లాలోనూ రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలతో పత్తి, వరి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వత్సవాయి, గంపలగూడెం, నందిగామ, కంచికచర్ల, (మిగతా 6లో)

విజయవాడలో కురుస్తున్న వర్షం

మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ప్రతిఒక్కరి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

- నెల రోజుల పాటు వైద్య పరీక్షలు, సహాయం
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్సిటీ

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ప్రణాళికలను రూపొందించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష పథకంపై సిఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా. పూనం మాలకొండయ్య, అదనపు కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యండి కృష్ణబాబు, డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇవో హరీంద్రప్రసాద్ ప్రధాన కార్యాలయం నుండి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ నెల15 నుంచి 30వ తేది వరకు సచివాలయాల పరిధిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎఎన్‌యంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇంటింటిని సందర్శించి ప్రతి ఒక్కరికి ప్రాథమికంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అక్టోబర్ 1 నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించి అనారోగ్య సమస్యలపై వైద్య సహాయం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో పాటు (మిగతా 6లో)

బిల్లులు రావు... సౌకర్యాలు ఉండవు

నందిగామ బాలుర సంక్షేమ హాస్టల్లో అరకొర వసతులు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

బిల్లుల మంజూరు కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో పేద విద్యార్థులకు కేటాయించిన ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌కు సౌకర్యాలు అందటం లేదు. కరోనా తర్వాత వసతి గహాలకు మరమ్మతులు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో హాస్టల్స్ పరిస్థితి దయనీయంగా మారింది. అధికారులు నాడు - నేడు నిధులతో మరమ్మతులు చేయించాలని హడావుడి చేసి ప్రతిపాదనలు పంపిన ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. ఎన్టీఆర్ జిల్లాలో 28 బీసీ సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. ఈ హాస్టల్స్‌లో 1300 మంది విద్యార్థులున్నారు. అదేవిధంగా జిల్లాలో 38 ఎస్సీ సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. ఈ హాస్టల్స్‌లో 2034 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో పలు చోట్ల కనీస సదుపాయాలు లేవు. తాగునీరు లేదు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. కరెంటు సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నాయి. కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసిన నిదులు రాక పనులు ప్రారంభించలేదు. మరోపక్క వసతి గహాలు తెలుసుకొని రెండు నెలలు దాటింది. విద్యార్థులు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

నందిగామ ఎస్సి బాలుర ఒకటి హాస్టల్లో మూడు నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 89 మందికి పైగా ఉన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వీరంతా ఈ హాస్టల్లో వసతి పొందుతూ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయి దర్శనం ఇస్తున్నాయి. రన్నింగ్ వాటర్ సౌకర్యం లేక విద్యార్థులు బకెట్లతో నీటిని పట్టుకుంటున్నారు. ప్లాస్టిక్ వాటరు ట్యాంకులు పగిలి పోయాయి. రెండు గదుల్లో ఫ్యాన్లు లేవు. విద్యార్థులకు దుప్పట్లు లేవు. తాగినీటి పైప్‌లైన్ విస్తరించాల్సి ఉంది. ఎస్సీ బాలికల వసతి గహం ఎస్‌సి బాలుర కళాశాల హాస్టల్‌లో కూడా సౌకర్యాలు లేవు. నందిగామ నియోజకవర్గంలో 7 ఎస్‌సి గహాలున్నాయి. జిల్లాలో 11 ఎస్టి గహాల్లో మైనరు, మేజరు మరమ్మతు పనులు చేయించాల్సి ఉన్నాయి. నిధులు కేటాయించి పనులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

డైట్ బిల్లులు మంజూరుపై జాప్యం

హాస్టల్ గహాల విద్యార్థులకు భోజనం తయారు చేసి వడ్డిస్తున్నారు. వీటికి అవసరమైన కూరగాయలు కిరాణా సరుకులు వసతిగహాల సంక్షేమ అధికారులు తీసుకొస్తున్నారు. మార్చి నుంచి ఇప్పటివరకు డైట్ పిల్లలు మంజూరు కాలేదు. కానీ వసతి గహాల సంక్షేమ శాఖ అధికారులు కిరాణా షాపుల్లో అప్పులు చేసి సరుకులు తెస్తున్నామని చెప్పారు. నందిగామ ఒక వసతి గహ సంక్షేమ అధికారి మూడు లక్షల పైగా డైట్ పిల్లలకు రావాల్సి ఉన్నాయని చెప్పారు. అప్పు చేసి పెడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, బీసీ, సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు విజయభారతి రుక్మంగా దయ్యా మాట్లాడుతూ వసతి గహాలు మరమ్మతులకు ప్రతిపాదన పంపడం జరిగిందన్నారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులు పనులు చేపట్టాలని విద్యార్థులు సౌకర్యాలు పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డైట్ బిల్లులు విడుదలైంది అన్నారు. బిల్లులు ఆన్లైన్ చేయాలని, సిఎఫ్ఎంఎస్ విధానాల సాంకేతిక లోపం వల్ల సమస్యలు నిలిచిపోయానని డైట్ బిల్లులు ఇస్తామని చెప్పారు బయట పిల్లలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ బీసీ సంక్షేమ శాఖ ఎస్టీ సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న హాస్టల్స్ విద్యార్థులు డైట్‌ఫిల్స్ తక్షణమే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి గోపి నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు నైట్ బిల్లులు సక్రమంగా రాకపోవడం వల్ల హాస్టల్స్ వార్డెన్స్ అప్పుడు చేసి విద్యార్థులకు భోజనం పెట్టవలసిన దిష్టి ఏర్పడిందని హాస్టల్స్ పరిస్థితిగా మారిందన్నారు తక్షణమే డైట్ ఫిల్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు సంక్షేమ శాఖ హాస్టల్ పరిధిలో సౌకర్యాలు మెరుగుపరచాలని నాడు నీడ ద్వారా హాస్టల్స్ ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ

అధ్వానంగా ఉన్న బాత్రూమ్‌లు

మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

యువగళం వాలంటీర్ల అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : గత రాత్రి భీమవరం దాటిన తర్వాత బేతపూడి గ్రామం శివారులో యువగళం క్యాంప్ సైట్‌లో అర్ధరాత్రి యువగళం వాలంటీర్లను వ్యానుల్లో కుక్కి అరెస్టు చేశారని, వైకాపా ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఇదే పని చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం రఘురాం అన్నారు. ఆయన స్వగహంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైతే ఇక్కడ ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ పీనల్ కోడ్ చట్టాలున్నాయో వాటిని వైకాపా వాళ్లకి రక్షణగా, ఎదుటి వాళ్లకి శిక్షించేలా వాటిని అన్వయిస్తూ ముందుకుపోతున్న దుర్మార్గమైన పరిపాలనని మనం చూస్తున్నామని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి తాళ్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కరిసే మధు

విజిలెన్స్ కమిటీ సభ్యునిగా కరిసే మధు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: టీచర్స్ అకాడమీ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ కరిసే మధుకి షెడ్యూల్ కులానికి ప్రాధాన్యత నిస్తూ యన్.టి.ఆర్ జిల్లా కాన్సూ్పషన్ ఆఫ్ విజిలెన్స్ కమిటీ లో సోషల్ యాక్టివిటీవ్ లోకల్ ఏరియా గా ప్రభుత్వం నియమించి నట్లు యన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ మరియు డిస్ట్రిక్ లెవెల్ విజిలెన్స్ కమిటీ చైర్మన్ యస్ డిల్లీరావు ఉత్తర్వులు అందజేసారు. ఈ సందర్భంగా కరిసే మధు మాట్లాడుతూ యన్.టి.ఆర్ జిల్లా డిస్ట్రిక్ లెవెల్ విజిలెన్స్ కమిటీలో సోషల్ యాక్టివిటీవ్ లోకల్ ఏరియా గా ప్రభుత్వం అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభానుకి, కలెక్టర్ యస్ డిల్లీరావుకి, యన్.టి.ఆర్ జిల్లా ఉన్నతాధికారులకు టీచర్స్ అకాడమీ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ కరిసే మధు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాడు.

8న వాహనాల వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: విజయవాడ పోలీసు కమీషనరేట్ పరిధిలోని చిల్లకల్లు, వత్సవాయి పోలీస్‌స్టేషన్లలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేయబడిన 14 వాహనాలు (చిల్లకల్లు పి ఎస్ -8 వాహనాలు, వత్సవాయి పి ఎస్ -6 వాహనాలు, 3 వీలర్స్ -2, 2 వీలర్స్ -12) ఎన్టీఆర్ జిల్లా పోలిస్ కమీషనర్ ఆదేశాల ప్రకారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎఇఎస్ అధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన చిల్లకల్లు పశువుల సంత వద్ద వేలం పాట నిర్వహించడం జరుగుతుందని, ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఈ నెల 8 వ తేదీ ఉదయం 9గంటలకు సంత వద్దకు వచ్చి వేలంపాటలో పాల్గొనాలని సిఐ తెలిపారు.

నేరారోపణ ఆధారంగా

సత్వర విచారణ, శిక్ష

ఏడాదిన్నర కాలంలో వందల కేసులు పరిష్కారం

నగర పోలీసు కమిషనర్ కాంతిరాణా టాటా

ప్రజాశక్తి-విజయవాడ : విజయ వాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇటీవల కాలంలో పలు కేసులను తీవ్ర నేరంగా పరిగణించి "కన్విక్షన్ బేస్డ్ ట్రైల్ మోనటరింగ్" పద్ధతిలో త్వరితగతిన ట్రయిల్‌ను పూర్తి అయ్యే విధంగా, నిందితులకు శిక్ష పడేలా పోలీసులు పని చేయడం జరిగిందని, ఇది గొప్ప ఎచీవ్‌మెంట్స్ అని నగర పోలీసు కమిషనర్ (సి.పి) కాంతిరాణాటాటా పేర్కొన్నారు. తన చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి చెందిన దివ్యాంగురాలైన మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితునికి మరణించేంత వరకు జైలు శిక్ష (జీవితకాలపు జైలు శిక్ష)ను విజయవాడ పోక్సో కోర్ట్ విధించడం జరిగిందని సి.పి అన్నారు. నెలలోపే చార్జీషీట్ దాఖలు చేయడం, నేరం జరిగిన కేవలం ఎనిమిది మాసాల కాలంలోనే నేరం చేసిన నిందితుడికి శిక్ష పడేలా పోలీసులు కృషి ఎంతో ఉందన్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో 54 మహిళలపై జరిగిన కేసులకు సంబంధించి నేరారోపణ ఆధారంగా త్వరిత గతిన విచారణ జరిపించడం, నిందితులకు శిక్షపడేలా చేయడంలో పోలీసుల పాత్ర ఎంతోఉందన్నారు. అలాగే వివిధ రకాల మరో 34 కేసుల్లో కూడా త్వరిత గతిన విచారణను పూర్తి చేయించి, నిందితులకు శిక్షపడేలా చేయడం జరిగిందన్నారు. గడిచిన ఈ ఏడాదిన్నర కాలంలో మొత్తంగా 88 కేసుల్లో నిందితులకు శిక్ష పడటం జరిగిందన్నారు.

కాంతిరాణాటాటా

రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు ప్రతి సి.పి స్థాయి నుంచి ఎస్.పి స్థాయి అధికారి పరిధిలో అత్యంత కష్టతరమైన ఐదారు కేసుల చొప్పున టేకప్ చేసి, నేరారోపణ ఆధారంగా సమగ్ర విచారణ చేసి ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 120 కేసుల్లో 116 కేసులను త్వరితగతిన విచారణ జరిపించి, నిందితులకు శిక్ష పడేలా చేయడం జరిగిందన్నారు. ఇలాగే ప్రతి స్టేషన్ పరిధిలోని ఎస్ఐ, సిఐ, డిఎస్‌పి స్థాయిల్లో కూడా ప్రతి స్టేషన్ పరిధిలో ఐదు కేసుల చొప్పున విచారణ జరిపించి, నేరారోపణ ఆధారంగా నిందితులకు శిక్ష పడేలా కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 15 వేల పిటి కేసులకు గాను 1700 కేసులకు త్వరగా జడ్జిమెంట్ రావడం, నిందితులకు శిక్షపడేలా చేయడంలో పోలీసుల కృషి ఎంతో ఉందని అన్నారు. ఇది ఒక గొప్ప పరిణామం అని సి.పి పేర్కొన్నారు.

వాహనాలు వేలం వేస్తున్న దృశ్యం

వాహనాల వేలంతో రూ.4.67 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక పోలీస్ స్టేషన్లో కొన్ని సంవత్సరాల నుండి వివిధ కేసుల్లో ఇరుక్కుపోయిన ద్విచక్ర వాహనాలను గురువారం వేలం వేశారు. కోర్టు ఆదేశానుసారం ఎఇఎస్‌యు సుబ్బారావు పర్యవేక్షణలో వేలం జరిగింది. 51 వాహనాలకు గానూ కేవలం 30 వాహనాలు మాత్రమే వేలంలో కొనుగోలు చేశారు. ప్రతి వ్యక్తి దరావత్తు 500 రూపాయలు చెల్లించి ఇందులో పాల్గొన్నాడు. మొత్తం 4,67,566 రూపాయలు వచ్చినట్లు ఎస్సై బి.రాంబాబు తెలిపారు. మిగిలిన వాహనాలను మరో సందర్భంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం ధరలు నిర్ణయించి వేలం వేయనున్నట్లు తెలిపారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న దశ్యం

ఏడో వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఏడో వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్య క్రమం నిర్వహిం చారు. ప్రజలకు బాబు సిఎం అయితే ప్రజలకు ఏం మేలు జరుగుతుందో... ఏ పథ కాలు వర్తిస్తాయో అని ప్రతి ఒక్కరికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడో వార్డ్ ఇంచార్జ్ దారెల్లి బుజ్జి,బూత్ కన్వీనర్ చిట్లూరి కిషోర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారెల్లి లవ్, తెలుగు యువత నాయకుడు దారెల్లి గాంధీ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నం మేయర్‌గా వెంకటేశ్వరమ్మ బాధ్యతలు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక నగర పాలక సంస్థ నూతన నగర మేయరుగా చిటికిన వెంకటేశ్వరమ్మ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 4 వ తేదిన ఆమె మేయరుగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం విధితమే. నగర పాలక సంస్థ మేయర్ ఛాంబర్లో డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి నాగ కుసుమరాణి, మాజీ మేయర్ మోకా వేంకటేశ్వరమ్మ, మాజీ డిప్యూటీ మేయర్లు, లంక సూరిబాబు, తంటిపూడి కవిత, కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ సిబ్బంది సమక్షంలో సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం మేయరుగా వెంకటేశ్వరమ్మ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన సిఎం జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి, శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని), నగర పాలక సంస్థ కార్పొరేటర్లుకు, 43 వ డివిజన్ ప్రజలకు, నగర పౌరులకు కతజ్ఞతలు తెలిపారు. మచిలీపట్నం నగర అభివద్ధికి శక్తివంచన లేకుండా కషి చేస్తానని హామీ ఇచ్చారు. నగర పాలక సంస్థ అభివద్ధి పనులను శాసన సభ్యులు, ఇద్దరి డిప్యూటీ మేయర్లు, 50 మంది డివిజన్ల కార్పోరేటర్ల సహాయ సహకారాలతో పూర్తి చేయటకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పేర్ని కష్ణమూర్తి (కిట్టు), నగర వైసిపి అధ్యక్షులు షైక్ సిలార్ దాదా, 43వ డివిజన్ ఇంచార్జ్ చిటికిన నాగేశ్వరరావు, కార్పొరేటర్లు మునిసిపల్ కమీషనర్, జి చంద్రయ్య, అసిస్టెంట్ కమీషనర్ బి జ్యోతిలక్ష్మి, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వరమ్మ

10న గ్రీన్ కార్నివాల్

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈ నెల 10వ తేదీన సెయింట్ ఆన్స ఆధ్వర్యంలో అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రీన్ కార్నివాల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్వజన స్నేహ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సిస్టర్ సుగుణ ఫ్రాన్సిస్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సెయింట్ ఆన్స సంస్థ గత కొన్ని దశాబ్దాలుగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో ముందుండి పని చేస్తుందన్నారు. పేదల కోసం పాటుపడుతూ మరోవైపు ప్రపంచానికి పెను సవాలుగా మారిన పర్యావరణం లో వచ్చే మార్పులు వాటి పరిణామాలు దష్టిలో ఉంచుకొని తమ సంస్థ పర్యావరణ పరిరక్షణ కూడా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వ్యర్థాలను ఉపయోగించి ఎరువులు తయారు చేయడం, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, అందరూ పెరటి తోటలు వేసేటట్లుగా ప్రేరేపించడం, మొక్కలు నాటించడం ద్వారా భావితరాలు పర్యావరణం పట్ల బాధ్యతను పెంపొందించడానికి వారి చేత ఎకో క్లబ్బులు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలలో బాధ్యత చైతన్యం తీసుకురావడానికి కషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. దీని ద్వారా పర్యావరణంలో మానవ జీవితాలు ఎలా ముడిపడి ఉన్నాయి పర్యావరణ మార్పులతో మానవ మనుగడకు ఎలా ముప్పు వాటిలనున్నదో అనే అంశాలను ప్రజలకు తెలియజేయునన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మొక్కలు ఎక్కువగా నాటి పెంచాలని తద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడడంతో పాటు భూగర్భ జలాలను పరిరక్షించుకొనేలా ప్రజలను చైతన్య పరచాలని సంకల్పంతో ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుతో పాటు పలువురు పర్యావరణవేత్తల ను కూడా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమస్త కోఆర్డినేటర్ సిస్టర్ జాయిస్ కురియన్, సెయింట్ ఆన్స కాన్వెంట్స్ సుపీరియర్ సిస్టర్ మౌళి థామస్, అవనిగడ్డ ఆదర్శ మాక్స సొసైటీ ఇన్చార్జ్ సిస్టర్ ఏసు పాల్గొన్నారు.

తుంగలవారిపాలెంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని తుంగల వారిపాలెం గ్రామంలో తెలుగు మహిళ సంఘం ఆధ్వర్యంలో మహాశక్తి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు బండి నాగవెంకట కనకదుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు మహిళలు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో లోని పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతోపాటు ఉచిత గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఉచిత బస్సు పాస్, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద రూ 18 వేల రూపాయలు, చదువుకునే పిల్లలకు రూ 15 వేల రూపాయలు, రైతులకు 20 వేల రూపాయలు, నిరుద్యోగ యువతకు నెలకొరు మూడువేల రూపాయలు చొప్పున ఇవ్వనున్నట్లు చెబుతూ ఇంటింటా కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు మోర్ల జయలక్ష్మి, విశ్వనాథపల్లి పావ, యాసం లంకమ్మ, మట్ట నారాయణమ్మ, కమ్మిలి అన్నపూర్ణమ్మ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు భోగిరెడ్డి బుజ్జి, మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాసరావు, తండు గంగాధర్ గ్రామస్తులు పాల్గొన్నారు

ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

ఉపాధ్యాయులను అవమానించడం తగదు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఉత్తమ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుల శిక్షణలు కీలకమని, అయితే 5 వ తేదీ జరిగిన గురుపూజోత్సవంలో రాష్ట్ర మంత్రి సురేష్ గురువు కన్నా గూగుల్ మేలని చెప్పటం గురువులను అవమానించటమేనని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు కొడమంచిలీ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువులు నవ సమాజ నిర్మాతలు, కాగా మంత్రికి గురువుల పట్ల సానుకూలత లేకపోవటం బాధాకర మన్నారు. 30 వేల మంది టీచర్లను సర్కార్ బదిలీ చేసి మూడు నెలలైనా నేటికీ జీతాలు అందలేదన్నారు. వీటిని పరిష్కరించ కుండా మంత్రి టీచర్లను అవమానించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. సమాజంలో గౌరవంగా జీవించే టీచర్లకు నేడు బతక లేక బడి పంతులు రోజులా మారాయన్నారు. ఒక పక్క గురుపూజోత్సవం ఎక్కడో దూరంగా విశాఖపట్టణంలో ఏర్పాటు చేసి సరియైన వసతులు ఏర్పాటు చేయక, మూడు నెలలుగా జీతాలు ఇవ్వక అనేక ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తూ ఒక రాష్ట్ర మంత్రి హేళనగా మాట్లాడటాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర మంత్రి చేతనైతే సకాలంలో జీతాల సమస్య పరిష్కారించి ట్రజరిలో జాప్యం లేకుండా మొదటి వారంలో జీతాలు వచ్చేటట్టు చెయ్యాలని కోరారు. ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ నడుపుతూ కూడా గురువులను తక్కువ చేసి మాటలాడటం తగదని హితవు పలికారు. వారి రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివద్ధికి ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ కారణమని గుర్తుంచు కోవాలని చెప్పారు. బేషరతుగా ఉపాధ్యాయులకు మంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

పేద విద్యార్థులకు మైత్రీ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : బందరు మండలం తాళ్లపాలెం పంచాయతీ సత్తెన పాలెం గ్రామానికి చెందిన 6 వ తరగతి చదువుతున్న గంటా చంద్రశేఖర్ అనే విద్యార్థి ప్రతిరోజూ స్కూలుకి వెళ్లు నిమిత్తం 2 కి.మీ లు కాలినడకన వెళుతూ ఇబ్బంది పడుతుండగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు పెద్ది రామ కష్ణ ద్వారా విషయం తెలుసుకుని ఆ బాలుడుకు (6 వేల రూపాయల విలువైన) కొత్త సైకిల్ ను వితరణ చేశారు. పట్టణంలో స్థానిక టెంపుల్ కాలనీ ప్రాంతానికి చెందిన సయ్యద్ ముస్విరా అనే ప్రతిభ గల పేద విద్యార్థినికి డిప్లొమా లో ఉచితంగా సీటు వచ్చినప్పటికీ ప్రయాణ ఖర్చులు,పుస్తకాలు ఖర్చులు లేక ఇబ్బంది పడుతుండడం స్థానికుల ద్వారా తెలుసుకుని ఆ విద్యార్థినికి 10,000 చెక్కు (ఆర్థిక సాయం) అందించారు. సన్ స్టార్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టార్ అడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ అయ్యప్పస్వామి, ప్రిన్సిపాల్ ఆదిత్య ల చేతుల మీదుగా విద్యార్థులకు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు కె.వేణు కుమార్, ఉపాధ్యక్షులు బి.గంగయ్య నాయుడు, జాయింట్ సెక్రటరీ జి రమాదేవి సభ్యులు ప్రసాద్,రామకష్ణ, దీప్తి,భాస్కర్, రమాదేవి, రమేశ్, రూప, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కదిలే రైలు దిగుతుండగా యువతికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడలో రైలు దిగవలసిన యువతి మరిచిపోయి కదిలే రైలు నుండి దిగి కాలుజారి ప్రమాద వశాత్తు రెండుకాళ్ళ పోగొట్టుకున్న సంఘటన బుధవారం గుడివాడ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పొల జాహ్నవి సాయిశ్రీ పుట్టపర్తిలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తోంది. తన స్వగ్రామమైన గుడివాడ వచ్చేందుకు మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుంది. గుడివాడ స్టేషన్ వచ్చినా దిగడం ఆలస్యం అవ్వడంతో నడుస్తున్న రైలు నుండి దిగి ప్రమాదవశాత్తు రైలుకిందపడి ప్రమాదానికి గురైంది. దీంతో ఆమె శరీరం నడుము వరకు తెగిపోయింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆమెను గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు 108 వాహనంలో విజయవాడకు తరలించారు. గుడివాడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరు కలెక్టర్‌పై చర్యలకు లోకాయుక్త ఉత్తర్వులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మచిలీపట్నంలో జరిగిన కష్ణాజిల్లా సర్వ సభ్య సమావేశానికి హాజరుకాని ఏలూరు జిల్లా కలెక్టర్ శ్రీ వి.ప్రసన్న వెంకటేష్‌పై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి. లక్ష్మణరెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కష్ణాజిల్లా, ఉయ్యూరుకు చెందిన సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ రాష్ట్ర లోకాయుక్తకు చేసిన ఫిర్యాదుమేరకు లోకాయుక్త పైఉత్తర్వులను జారీచేశారు. గతంలో కష్ణాజిల్లాలో వుండి, ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న కైకలూరు, ముదినేపల్లి, నూజివీడు తదితర మండలాలలోని ప్రజా సమస్యలపై తగిన సమాధానాన్ని జిల్లా పరిషత్ సమావేశంలో చెప్పేవారే లేరని, సమావేశానికి ఏలూరు జిల్లా కలెక్టర్ హాజరు కాకపోవటంపై మాజీ మంత్రి మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) తన అసహనాన్ని సమావేశంలో వ్యక్తం చేయటం జరిగింది. కష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కష్ణాజిల్లా, ఎన్.టి.ఆర్. జిల్లా ఉన్నతాధికారులు హాజరగు చున్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా ఏలూరు జిల్లా కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్, ఇతర ఉన్నతాధికారులు హాజరుకాకపోవడంపట్ల రాష్ట్ర లోకాయుక్త కి ఫిర్యాదు చేశారు.

'యువగళం'పై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో శాంతియుతంగా జరుగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి వైసిపి నేతల గుండెల్లో వణుకు పుడుతూ ఓర్వలేక వైసీపీ గుండాలు పాదయాత్ర అడ్డుకునేందుకు దాడులు చేస్తున్నారని మచిలీపట్టణం పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి విమర్శించారు. యువ గళం పై వైసీపీ దాడిని నిరసిస్తూ బుధవారం కష్ణా జిల్లా తెలుగు యువత ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద జగన్మోహన్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసారు .ఈ సందర్భంగా దండమూడి చౌదరి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం శివారు గునుపూడి లో వైసిపి కవింపు చర్యలు, దాడులు అత్యంత దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రౌడీయిజాన్ని ప్రోత్సహించి అల్లర్లు, అరాచకాలు, విధ్వంసాలకు పాల్పడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు హసీం బిగ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు సలీం ,కట్ట దుర్గ ,కోరసిక శ్రీను పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

విజయవాడలో లోతట్టు ప్రాంతాలు జలమయం

- జగ్గయ్యపేటలో అత్యధిక వర్షం - మెట్ట, మాగాణి పంటలకు జీవం...

విజయవాడలో...

విజయవాడలో బస్టాండ్ దగ్గర నీట మునిగిన రోడ్డు

ప్రజాశక్తి - విజయవాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి విజయవాడ నగరం తడిచి ముద్దయింది. 3.30 గంటల నుంచి సుమారు గంట పాటు కురిసిన వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. స్లమ్ ప్రాంతాల్లో నీరు నిలబడింది. జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 11.30 గంటల సమయములో చిరు జల్లులతో వర్షం ప్రారంభమై కొద్దిసేపు కురిసింది. సాయంత్రం 4.30 తరువాత కూడా చిరు జల్లులు పడుతూనే ఉన్నాయి. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉండి, బుధవారం రాత్రి వరకు కూడా బలమైన వర్షం పడే సూచనలు కనిపిస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజుల నుంచి నగరంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. చలిగాలులు వీస్తున్నాయి. వర్షానికి ముందు బలమైన వీధురుగాలులు వీచాయి. చిరు వ్యాపారాలపై వర్షం తీవ్రమైన ప్రభావం చూపింది. భవన నిర్మాణ పనులు, హమాలీ, ఇతర రంగాల్లోని పనులపై కూడా వర్షం ప్రభావం చూపింది. దీంతో ఈ పనులపై ఆధారపడి ఉన్న కార్మికులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. బీసెంట్ రోడ్డు,గాంధీనగర్, వన్‌టౌన్, పటమట తదితర ప్రాంతాల్లోని వీధి వ్యాపారాలకు ఆటంకం ఏర్పడింది. యధామామూలుగానే అధ్వాన్నంగా తయారయిన డ్రైనేజి వ్యవస్థ కారణంగా పడిన వర్షపునీరు పారుదల లేక ఎక్కడి నీరు అక్కడే అన్నట్లుగా తయారయ్యి, రహదారులపై కూడా పెద్ద ఎత్తున నీరు నిలబడింది. కృష్ణాష్టమి సెలవు రోజు కావడంతో జలమయం అయిన ఆయా ప్రాంతాల్లో నీటిని బయటకు పంపించేందుకు విఎంసి అధికారులు కూడా అందుబాటులో లేకపోవడంతో నీటిలోనే ప్రజలు ఉండిపోక తప్పలేదు. భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీ, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, వన్‌టౌన్, కాళేశ్వరరావు మార్కెట్, నైజాంగేటు, సెంట్రల్‌లోని ఐదవ నెంబర్ రూట్, బిగ్‌బజార్, మ్యూజియం రోడ్డు, బీసెంట్ రోడ్డు, గాంధీనగర్, హనుమాన్‌పేట, సిద్దార్థాఫాలీక్లీనిక్‌రోడ్డు, సున్నబట్టీల సెంటర్, లయోలా కళాశాల, ఈనాడు ఎదురు, పటమట రైతు బజార్, ఆటో నగర్, అయ్యప్పనగర్, రామలింగేశ్వర్‌నగర్, కృష్ణలంక రాణిగారితోట, కృష్ణలంక 20, 21,22 డివిజన్లలోని పలు వీధులన్నీ జలమయం అయ్యాయి. వీధులన్నీ చిత్తడి చిత్తడిగా మారడంతో శానిటేషన్ లోపించింది. మధ్యలోనే నిలిపివేసిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కిమ్ కారణంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజి పూర్తికాక గోతుల మయంగా తయారయ్యి. మురుగునీటికి వర్షపునీరు తోడై, పెద్ద ఎత్తున నీరు చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆగిపోయిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేసి, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు.

కంచికచర్ల : అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం రాత్రి వరకు పలు దఫాలుగా జల్లులు పడుతున్నాయి. దాదాపుగా నెల రోజుల తర్వాత వర్షం కురవటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా వాతావరణ బెట్టకు వచ్చి తీవ్ర ఉబ్బతీసింది. దీంతో జనం అల్లాడిపోయారు. వర్షం లేకపోవటంతో ఈ ప్రాంతంలో సాగు చేసిన ప్రత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు బెట్టకొచ్చి గిడసబారిపోయాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు, నందిగామ , జగ్గయ్యపేటలో కొద్దిపాటి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి కంచికచర్లలో 15.6, వీరులపాడులో 17.2, చందర్లపాడులో 34.8, నందిగామలో 32.4, జగ్గయ్యపేటలో 69.2, వత్సవాయిలో 36.2, పెనుగంచిప్రోలులో 31.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి కూడా వర్షం కురిసింది. విజయవాడ నగరంలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేని వర్షాలతో పలు రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. కంచికచర్లలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మధిర రహదారి అస్తవ్యస్తంగా మారి, గుంటల్లో వర్షం నీరు నిలబడి ఈ రహదారి ప్రమాదకరంగా మారింది. నెలరోజుల తర్వాత వర్షం కురవటంతో మెట్ట, మాగాణి పంటలకు జీవం పోసినట్లైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం కురిసిన కొద్దిపాటి వర్షానికే కంచికచర్లలో మధిర వెళ్ళే ప్రధాన రహదారిపై గోతుల్లో వర్షం నీరు నిల్వ చేయటంతో రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కంచికచర్లలో...

అకాల వర్షంతో రైతుల సంతోషం

గంపలగూడెం : నెల రోజులుగా వర్షానికై రైతులు ఎదురుచూస్తున్నారు. మండలంలోని ప్రత్తి, మిర్చి దాదాపు 1500 ఎకరాలకు పైగా రైతులు సాగు చేస్తున్నట్లు సమాచారం. ఇతర పంటలు మినహాయిస్తే ప్రధానంగా పత్తి, మిర్చి పంటలకు నీరు అవసరమని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది పరిస్థితులు రీత్యా సాగర్ జలాలు సైతం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగర్ జలాలు వస్తాయనుకున్న రైతులకు కంట కన్నీరే మిగిలిందని చెప్పక తప్పదు. కొందరు రైతులు బోర్ల ద్వారా నీటిని పంటలకు సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బుధవారం రాత్రి నుండి అనుకోకుండా మండల వ్యాప్తంగా ఒక మాదిరి వర్షం పడటంతో సాగుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గంపలగూడెంలో పత్తి తోట

పత్తి రైతుల ఆందోళన

వత్సవాయి : బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా గత రెండు రోజుల నుండి కుడుస్తున్న వర్షాలకు పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు ఎండ తీవ్రతకు తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోయారు. దీంతో వర్షం ఎప్పుడు కురుస్తుందా అని మిర్చి రైతులు ఎదురు చూశారు. రైతులు వ్యవసాయ పనిలో నిమగ్నం కావడంతో అకాల వర్షాలువల్ల ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. మండలంలో 10,000 పైగా పత్తి సాగు చేపట్టారు. ఈ సంవత్సరం మిర్చి కన్నా పత్తి చాలా తక్కువగా వేశారు. వర్షాల వల్ల పత్తి ఎదుగుదల లోపించి. చీడ పీడలు ఎక్కువ అవుతాయని. వేరుకుల్లుడు సోకే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. డ్రైనేజీలో నిండి పొర్లు ప్రవహించాయి.

జర్నలిస్టులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, క్లబ్ సభ్యులు

సమాజంలో జర్నలిస్టుల సేవలు విలువైనవి

- ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సమాజానికి జర్నలిస్టుల సేవలు ఎంతో విలువైనవని అలాంటి వారిని సత్కరించటం సామాజిక బాధ్యత అని ఎంఎల్‌ఎ వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వాసవి క్లబ్ ఆదర్శ మహిళ అధ్యక్షురాలు గ్రంధి రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం వాసవి ఇంటర్నేషనల్ జర్నలిస్ట్ డే సందర్భంగా ఆంధ్ర పత్రిక విజయవాడ బ్యూరో చీఫ్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు, వార్తా ప్రభ దినపత్రిక సీనియర్ జర్నలిస్టు యేమినేని వెంకట రమణలను తమ క్లబ్ తరపున ఘనంగా సత్కరించారు. వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించిన వాసవీ క్లబ్ మహిళా నాయకురాళ్లను, సన్మాన గ్రహీతలు వారు అభినందించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ఆదర్శ్ అధ్యక్షురాలు గ్రంధి రాజరాజేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఆదర్శ మహిళ కార్యదర్శి దోరడ్ల కవిత, కోశాధికారి బొమ్మిశెట్టి కవిత తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నాయకులు, స్థానికులు

సిపిఎం నిరసన

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : సిపిఎం సమరభేరిలో భాగంగా బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, రాస్తారోకో, బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశ, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ మభ్యపెడుతూ వస్తున్నాయని తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు పెంచాలని, 400 రూపాయలకే గ్యాస్ ఇవ్వాలని, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, ఉయ్యూరు కష్ణారెడ్డి, చాట్ల విజయకుమార్, గద్దల ఇశ్రాయేలు, అప్పిరెడ్డి, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్ర కీలాద్రి దుర్గ మ్మ దర్శనార్థం రాజ్య సభ సభ్యులు డి.దామో దర్ రావు, తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు శ్రీ అమ్మ వారి దర్శనార్థం బుధవారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ చైర్మన్ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం వీరికి అందజేశారు.

ప్రసాదాలు అందుకుంటున్న ప్రముఖులు

కరపత్రం ఇస్తున్న గద్దె రామ్మోహన్‌రావు

13వ డివిజన్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వైఎస్. జగన్మోహన్రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడుతు న్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. బుధవారం ఉదయం 13వ డివిజన్లో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ పాల్గొని చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికి వెళ్ళి కరపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు గద్దె ప్రసాద్, వేములపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఉచిత భోజనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పేద ప్రజలకు కడుపునిండా రుచికరమైన భోజనం పెట్టాలనే సంకల్పంతో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు సామినేని ఉదయభాను నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిరంతరం జరిగే రాజన్న ఉచిత భోజనం కార్యక్రమానికి వత్సవాయి మండలం దబ్బాకుపల్లి గ్రామానికి చెందిన బట్టు సీతయ్య, నాగమణి మనవరాలు శ్రీలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా బుధవారం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గం నుండి పలు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన వ్యాపారస్తులు, వివిధ వత్తుల వారు, ఉద్యోగస్తులు, విద్యార్థులు పట్టణానికి చెందిన నిరుపేదలు, అనాథ వద్ధులు, నిరాశ్రయులు 838 మంది రాజన్న ఉచిత భోజనం చేశారు.

ఉచిత భోజనం వడ్డిస్తున్న నాయకులు

చంద్రబాబును వెంటనే అరెస్ట్ చేయాలి : ఆకుల

ప్రజాశక్తి - భవానీపురం : ఐటి నోటీసుల నేపథ్యంలో ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును వెంటనే అరెస్టు చేసి సమగ్రంగా విచారించాలని వైసీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రూ. 118 కోట్లు స్కాం విషయంలో వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం ఐటి విభాగం వెలికి తీసిన రూ.118 కోట్లు సముద్రంలో నీటి బొట్టు మాత్రమేనని, ఐటి అధికారులు చంద్రబాబును విచారిస్తే చాలా విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. చంద్రబాబు ఐటీ విషయంలో నిప్పో, తుప్పో విచారణ జరిపించుకుని నిజాయతీ నిరూపించుకోవాలని ఆకుల శ్రీనివాస కుమార్ సవాల్ విసిరారు.

అబద్ధాలతో పేర్ని నాని అంకెలగారడీ

- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : పచ్చి అబద్దాలతో మాయమాటలు చెబుతూ తప్పించుకోవాలని ఎన్నికల కమిషన్ ఆఫీస్ ముందు పేర్ని నానీ అంకెల గారడి చేస్తున్నాడని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర విమర్శించారు. బుధవారం రవీంద్ర నివాసంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బందరులో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని సాక్షాత్తు న్యాయస్థానమే దర్యాప్తుకి ఆదేశిస్తే ఇంకా తెలుగుదేశం మీద బురద చల్లాలనే ధోరణిలో పేర్ని నాని సోది చెబుతున్నాడని విమర్శించారు.బందర్ లో ఏడవలేక ఎన్నికల కమిషన్ ఆఫీసుకు పోయి మీడియా మీద అక్కసు వెళ్లగక్కుతున్నడని ఎద్దేవా చేశారు. పేర్ని నాని

నువ్వు చేసిన అవినీతి అక్రమాలు ఎలక్షన్ కమిషన్ ఆఫీస్ దగ్గర పై ప్రెస్ మీట్ పెట్టాల్సిన అవసరం లేదు బందరులో నేను చర్చకు సిద్ధం మీరు చేసిన అవినీతి అక్రమాల చిట్టాతో మీరు ఎక్కడికి రమ్మంటే అక్కడ రావడానికి మేము సిద్ధం మీరు సిద్ధమేనా చెప్పాలన్నారు. మీ అవినీతి చిట్టా బయట పెట్టడానికి మా బూత్ స్థాయి ఏజెంట్ చాలు అన్నారు.తప్పుచేసి పబ్లిక్ గా దొరికిపోయి ఓటర్ల జాబితా సవరణలో ప్రజలు నీ బాగోతాన్ని తెలుసుకుంటే ఇంకా ఏదో ప్రజల్ని మభ్యపెట్టి మసిపూసి మారేడు కాయ చేయాలన్న ప్రయత్నం చేస్తున్నవని విమర్శించారు. నువ్వు చేసిన అక్రమాలు నీకు సహకరించిన అధికారులు అందరికీ తగిన బుద్ధి చెప్పే రోజు తొందరలోనే ఉంది సిద్ధంగా ఉండు అని హెచ్చరించారు.

ఏపీ పోలీసుల తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

కొంత మంది ఏపీ పోలీసుల తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులా మారిందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు.భీమవరం బేతపూడిలో లోకేష్ యువ గళం పాదయాత్ర పై వైసీపీ మూకలు పోలీసులతో కలిసి చేసిన దాడిని నిరసిస్తు బుధవారం రవీంద్ర నివాసం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంత మంది కాసుల కోసం పోస్టింగుల కోసం ప్రజాస్వామ్యాన్ని మంట కలుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడలేని అటువంటి పోలీసులకు పోలీసులుగా కొనసాగే అర్హత లేదన్నారు. ఈ ఘటన పై రాష్ట్ర డిజిపి సమాధానం చెప్పాలన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో బుధవారం ఎంఈఐఎల్, ఎస్ ఆర్ ఫౌండేషన్లు సంయుక్తంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించాయి. శుక్రవారం వరకు ఈ వైద్య శిబిరం కొనసాగనుంది. తొలిరోజు డోకిపర్రుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సుమారు రెండొందల మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో కొందరు దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. వీరు తమ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు వివరించారు. అవసరమైన మందులు అందచేశారు. కొందరు జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధులకు లోనైన వారు ఉన్నారు. వారికి వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించటం తో పాటు మందులు అందచేశారు. రోగులు త్వరగా కోలుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు పెరిగిపోతున్నాయని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఈఐఎల్, ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెంపల్లిలో మునిగిన ప్రధాన రహదారి

- వర్షం వస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తెంపల్లి గ్రామంలో ప్రధాన రహదారి మునిగిపోయింది. మోకాలు లోతు నీళ్లు నిలిచిపోవడంతో ప్రజలు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకి కి రెండు వైపులా డ్రైనేజీ కట్టి వదిలేశారు. మధ్యలో రోడ్డు పల్లంగా ఉండడంతో వర్షం పడితే చెరువుల మారుతుంది. తెంపల్లి బీసీ కాలనీవాసుల తోపాటు బల్లి పరు వెళ్లే ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వర్షం నీటితో పాటు డ్రైనేజీ లోని మురుగునీరు రావడం వల్ల దానిలో నడవలేక చర్మ రోగాలు వస్తాయని జనం భయ పడుతున్నారు. గతంలో ఈ విధంగానే రోడ్డుపై మురుగునీరు డ్రైనేజీలో మురుగు నీరు మంచినీటి పైపుల్లో కలవడంతో అతి సార వచ్చి ఐదుగురు మరణించిన సంగతి తెలిసిందే. రోడ్డు నిర్మాణం చేయించేందుకు పంచాయతీలో రూపాయి లేని పరిస్థితి ఉందని సర్పంచ్ కొలుసు శిరీష చెబుతున్నారు. రోడ్డు వేయించమని అనేకసార్లు విన్నవించిన నిధులు రాకపోవడంతో ఆగిపోయిందన్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు పట్టించుకుని ఈ తెంపల్లి రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తెంపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

8న మండల స్థాయి క్రీడాజట్ల ఎంపిక

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల ఆటల పోటీలు సెలక్షన్లు ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తు న్నట్లు మండలస్పోర్ట్స్ కోఆర్డినేటర్ జీవీ రమణ తెలిపారు. ఈనెల 8న బాలు రకు, 11న బాలికలకు పోటీలు జరుగుతాయని మండల స్థాయిలో ప్రతిభ కనపరచి ఎంపికైన జ ట్లు నియోజకవర్గ పోటీలకు అర్హులవుతారన్నారు. మండల స్థాయిలో 9 అంశాలలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, బాల్బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగ, అథ్లె టిక్స్లో ఎంపికలు జరుగుతాయని, మిగిలిన 30 క్రీడలకు జిల్లాస్థాయిలో నేరుగా ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వి ద్యార్థులు అర్హులని, అండర్- 14 బాలబాలికలు 01-01-2010 తరువాత, అండర్-17బాల బాలికలు 01-01-2007 తరువాత జన్మించి ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలలో చదువుతూ ఉండి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుండి ధ్రువీకరణ పత్రాలు సమర్పించి, అకడమిక్ మోనటరింగ్ యాప్లో ఎస్జీఎఫ్ గేమ్సునందు ఆన్లైన్ రిజిష్టర్ చేయించుకోవాలని తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

- విజృంభిస్తున్న విషజ్వరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాలలో పారిశుధ్య లోపించి విష జ్వరాలు వ్యాప్తిస్తున్నాయి. నివాసాల మధ్య చిన్న గుంటలు ఉన్న అక్కడ మురుగు నీరు చేరడంతో దోమలు ఈగలు విజంభించి రోగాలకు నిలయంగా మారాయి. ఈ సమయంలో విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలపై దోమలకు దాడి చేసి కాటు వేయడంతో డెంగ్యూ టైఫాయిడ్ లాంటి జ్వరాలతో ప్రజల నేటి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటికి ఇద్దరు ముగ్గురు రోగులు ఉన్న వైద్య సిబ్బంది కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దోమల నివారణ చర్యలు చేపట్ట పోవడంతో పాలకులపై ప్రజలు మండిపడుతున్నారు. మండల కేంద్రంతో సహా ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసి ఉన్నాయి. చల్లపల్లి ప్రభుత్వలో రోగులను కనీసం జ్వరం చూడకుండానే మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం

చేస్తున్నారు. తలనొప్పి జ్వరం ఒళ్ళు నొప్పులు తో ప్రారంభమై టైఫాయిడ్ డెంగ్యూ గా మారుతున్నాయని ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా గ్రామాల్లో ఈ పరిస్థితి ఉన్న పాలకులు గాని వైద్య సిబ్బంది గానీ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడం ప్రజల పట్ల పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. గ్రామాలలో దోమల మందు చల్లించడం కానీ, బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల కాటు నుండి ప్రజలను కాపాడాలని కోరుకుంటున్నారు. గ్రామాలలో తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.

ట్యాబ్ల వినియోగంపై శిక్షణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : భవిష్యత్ అంతా డిజిటల్మయం కానున్న పరిస్థితుల్లో విద్య పూర్తిగా డిజిటల్ బోధన పై ఆధారపడి ఉంటుందని ఈనేపథ్యంలో ఉపాధ్యాయులు అందుకు సన్నద్ధం కావాలని జిల్లా నోడల్ పర్సన్ పడవల శివాజీ అన్నారు. మండల పరిధిలో ప్రధానోపాధ్యాయులకు స్థానిక వీ ఆర్ కె యం పాఠశాల ఆవరణలో బుధవారం బైజూస్ ట్యాబ్ల వినియోగంపై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో-2 సుధారాణి మాట్లాడుతూ డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులు విస్తత పరిజ్ఞానం కలిగిఉండి విద్యార్థులకు అవగాహన పెం పొందించాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని జిల్లాలో ఉయ్యూరు మండలం ముందుండాలన్నారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నోడల్ టీచర్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

శిక్షణనిస్తున్న జిల్లా నోడల్ పర్సన్ పడవల శివాజీ

ఉపాధ్యాయులను సత్కారిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-గన్నవరం : ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ సమరశీల పోరాటాలు చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, గన్నవరం ఎంపీపీ అనగాని రవి అన్నారు. గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రాత్రి సీనియర్ ఉపాధ్యాయుల అభినందన సన్మాన కార్యక్రమం యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నవరం మండలంలో సంఘానికి సేవలు అందిస్తూ విద్యాభివద్ధికి కషి చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులను దశ్శాలతో సన్మానించి వారి త్యాగాలను కొనియాడారు. బొడ్డు నాగేశ్వరరావు, రవి మాట్లా డుతూ.. ఉపాధ్యాయులు బాగుంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చదువులో బాగుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మరీదు వరప్రసాద్, రాజబాబు, గొట్టం రవి, పద్మావతి, జడ్పీ బిహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం భవాని పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ నుండి అవార్డు అందుకున్న ఆర్కె

ఆర్కెకు అవార్డు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ఎన్జీవో హెూంలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కంచనపల్లి నాగరత్నకుమారి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పట్టణంలో అనేక సేవా కార్యక్రమలు నిర్వహించిన జనసేన నాయకుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) మాజీ ఐపిఎస్ జెడి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జెడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, యువత సమాజానికి తమ వంతు సేవా కార్యక్రమాలు చేస్తు ఉండాలని కోరారు.

అభివృద్ధిపథంలో మోపర్రు : జూపల్లి

ప్రజాశక్తి పెదపారుపూడి : మండలంలోని మోపర్రు గ్రామ సర్పంచ్ జూపల్లి రాజేశ్వరి సర్పంచ్ పదవి చేపట్టి ఆగస్టు 13వ తేదీ నాటికి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామంలో అభివద్ధి చేసిన వివరాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జూపల్లి వెంకటరావు బుధవారం తన స్వగహంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం రూ. 43 లక్షలతో రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ ను మరో రూ. 43 లక్షలతో ఎంపీపీ నిధులు, ఐదు లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. గడపగడపకు నిధులు 10 లక్షలతో నాలుగు సిమెంట్ రోడ్లు, మోపర్రు నుండి దోసపాడు వెళ్ళు రోడ్డు కొద్దిదూరం రూ. 34 లక్షలతో, నందివాడ సత్రం నుండి మోపర్రు వరకు నాబార్డు నిధులు రూ. ఒక కోటి 25 లక్షలతో తారు రోడ్డు, జలజీవన్ మిషన్ నిధులతో రూ. 23 లక్షలతో ఇంటి ఇంటికి కుళాయి నూతనంగా 90000 లీటర్లు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ప్రణాళిక తయారు చేసినట్లు వెంకటరావు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

సాగుకు ఊతం

విజయవాడ బస్టాండ్ వద్ద నిలిచిన ట్రాఫిక్

జగ్గయ్యపేట తదితర మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. విజయవాడలో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి.

కృష్ణాజిల్లాలో 311.8 మిల్లీ మీటర్లు వర్షం

మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం 8.30 గంటల వరకు గడిచిన 24 గంటల్లో కృష్ణాజిల్లాలోని 25 మండలాల్లో 311.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. సగటున ఒక్కో మండలంలో సగటున 12.5 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. అత్యధికంగా బంటుమిల్లి మండలంలో 43, కృత్తివెన్నులో 36.6, పెనమలూరులో 20.4, గన్నవరంలో 17.2, చల్లపల్లిలో 16.4, కోడూరులో 14.4, కంకిపాడులో 14.2, ఉంగుటూరులో 14.2, మోపిదేవిలో 13.4, పెదపారుపూడిలో 13.0, పమిడిమక్కులలో 11.4, తోట్లవల్లూరులో 10.2, అవనిగడ్డలో 9.2, గూడూరులో 9.2, పామర్రులో 8.8, వుయ్యూరులో 8.6, గుడివాడలో 6.2, పెడనలో 6.2, నాగాయలంకలో 5.8, గుడ్లవల్లేరులో 4.2, నందివాడలో 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

విద్యుత్ చౌర్యంపై ఉక్కుపాదం

మూలపాడు తదితర ప్రాంతాల్లో డొమెస్టిక్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కరెంట్ తీగలకు కొక్కాలు వేసి దొంగనంగా విద్యుత్ వినియోగానికి పాల్పడుతున్నారు. దీంతో పాటుగా మీటర్‌లలో వైర్లు మార్చేసి మీటర్ బైపాసింగ్, మాల్‌ప్రాక్టీస్‌కి పాల్పడుతున్నారు. గుడివాడ, ఉయ్యూరు వంటి ప్రాంతాల్లో అక్వా సర్వీసులకు సంబంధించి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. హెచ్‌టి కేసులతో పాటు పరిశ్రమలు, వ్యవసాయ కేటగిరీల్లో అక్రమంగా కరెంట్‌ను వినియోగించడం కొంత మేరకు తగ్గాయి. ప్రతి నెల మొదటి వారంలో విద్యుత్ చౌర్యంపైన, కేసుల పరిణామాలపైన విజిలెన్స్, థెఫ్ట్ స్క్వాడ్ అధికారులతో పాటు స్థానిక డిస్కం సిబ్బందితో కలిసి విద్యుత్ చౌర్యంపైన, ప్రమాదాలపైన ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, దీంతో విద్యుత్ చౌర్యం కేసులు చాలా వరకు తగ్గుముఖం పట్టాయని అధికారులు చెబుతున్నారు.

బందరులో ఎవరికి వారే...

ఎమ్మెల్యేలు కోరినట్లు తెలుస్తోంది. ఆయన ఆసక్తి చూపలేదని చెబుతున్నారు. మరోవైపు బాలశౌరి గుంటూరు నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

పెడన, గన్నవరంలోనూ విభేధాలు

పెడన నియోజకవర్గంలో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మంత్రి జోగి రమేష్ గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. వీరిరువురు మధ్య నెలకొన్న విభేధాలతో ఆ నియోజకవర్గంలో గత ఏడాది 10వ తరగతి స్టడీ మెటీరియల్స్ పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. ఫిల్టర్ బెడ్‌ల ఏర్పాటులోనూ, జడ్పీ నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఈ నియోజకవర్గంలో ముందుకు సాగడం లేదనే చర్చజరుగుతోంది. గన్నవరం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన యార్లగడ్డ వెంకట్రావు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో టిడిపి టిక్కెట్‌పై ఎంఎల్‌ఎగా గెలుపొందిన వల్లభనేని వంశీ వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దుట్టా రామచంద్రరావు, ఎమ్మెల్యే వంశీ గ్రూపులకు పొసగడం లేదని తెలుస్తోంది.

ప్రతిఒక్కరి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆసుపత్రులైన కార్పొరేట్ ఆసుపత్రుల్లోని వైద్య బృందం ప్రజలకు వైద్య చికిత్సలు అందించి మందులను ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. వైద్య ఆరోగ్య, జిల్లా పంచాయతీ, మహిళ శిశుసంక్షేమం తదితర శాఖల అధికారులు సమన్వయంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్, అడిషనల్ డియంఅండ్‌హెచ్‌ఓ డా. జె.ఉషారాణి, ఐసిడిఎస్ పీడీ జి.ఉమాదేవి, డిసిహెచ్‌ఎస్ డా.స్వప్న, జిల్లా మలేరియా అధికారి డా. మోతిబాబు, జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సైకిల్ థాన్-వాక్ థాన్' ర్యాలీ

ప్రజాశక్తి-విజయవాడ

స్వచ్ఛమైన గాలి నీలి ఆకాశం లక్ష్యంగా 4వ అంతర్జాతీయ దినోత్సవంను పురస్కరించుకొని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు కార్యక్రమాలను విజయవంతం చేయాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. గురువారం ఉదయం ఆరు గంటలకు "సైకిల్ థాన్ - వాక్ థాన్" కార్యక్రమాన్ని ఈట్ స్ట్రీట్ నుండి ప్రారంభించి బెంజ్ సర్కిల్ వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన రవాణా వ్యవస్థ వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి లక్ష్యంగా సైకిల్ థాన్ - వాక్ థాన్ ద్వారా సందేశాన్ని తెలుపుతూ కాలి నడక , సైకిళ్ళతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎం.డి.రుహుల్లా, వైసిపి తూర్పు నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజా, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్స్ తదితరులు పాల్గొంటారని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేరు మార్పు

నా పేరు షేక్ బాఖర్ తండ్రి పేరు : షేక్ మసూద్, డోర్ నెం. 75-5-56, ప్రెసిడెంట్ స్ట్రీట్, భవానీపురం, ఎన్‌టిఆర్ జిల్లా. విజయవాడ-520012. నా పాతపేరు SHAIK BAKAR S/o SHAIK MASUD. నా పేరును మరియు తండ్రి పేరును క్రొత్తగా మార్పు (సవరణ) చేయగా SHAIK BAKHAR గానూ S/o SHAIK MASOOD గానూ మార్పు చేయటం జరిగినది.

నేటి నా పేరు SHAIK BAKHAR గానూ తండ్రిపేరు SHAIK MASOOD గాను కొత్తగా మార్పు చేయటమైనది. భవిష్యత్తులో ఇంటి డాక్యుమెంట్, పాస్‌పోర్టు, ఇతర అవసరముల కొరకు ఈ మార్పు చేయటమైనది.

డాక్యుమెంట్లు పోయినవి

బొప్పన రత్నకుమారి W/o చౌదరయ్య, కనిగిరి లంక గ్రామము, తోట్లవల్లూరు మండలం, కృష్ణాజిల్లా. గుంటూరు జిల్లా కొల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెంబర్ 1170/2009 లో రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ పోయినది. మా స్వగ్రామమైన కనిగిరి లంక నుండి మండల కేంద్రమైన తోట్లవల్లూరు గ్రామానికి ద్విచక్ర వాహనము పై ప్రయాణిస్తుండగా మార్గమధ్యములో ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. మార్గమధ్యంలో ఎంత వెతికినను వాకబు చేసినను దొరకలేదు. ఎవరికైనను దొరికిన యెడల క్రింది మొబైల్ నంబర్లకు సమాచారం అందించగలరు.

6302857711
9701350727

పేరుమార్పు

ఆకుల శివనాగలక్ష్మి, తండ్రి: ఆకుల బసవయ్య, పామర్రు. 1-6-1996వ తేదీ నా వివాహానంతరం నా పేరు వుద్దగిరి శ్రీ నాగలక్ష్మి (UDDAGIRI SREE NAGALAKSHMI) భర్త : వుద్దగిరి వెంకట శ్రీనివాసరావు, డోర్ నెం. 15/39, శ్రీ లలిత రెసిడెన్సీ, మచిలీపట్నం. మార్పునకు లీగల్ ప్రొసీడింగ్స్ అనుసరించి మార్పు చేయుచున్నాను. కావున గమనించగలరు.

నా ఆధార్ నెం.901952894662

ఇట్లు
వుద్దగిరి శ్రీ నాగలక్ష్మి

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT :: BHIMAVARAM
EP No. 17 of 2023
in
S.C No. 14 of 2011

Between:
Kapil Chit Funds Pvt. Ltd
Bhimavaram Branch,
Rep. by It's Recovery Officer
... DHR
AND
Bandela George Raju and others
... JDRS

Notice to JDR No. 2,
Mobhudevvu Shiva Shankara Rao, S/o. Raghavulu, 44 years, Line Man, APSPDCL, Pedapalaparru, Mudinepalli Mandal, Krishna District.,
(JDR No. 2)

Please take notice that the above Execution Petition had filed for Attachment of your salary for recovery of EP amount and the Hon'ble Court ordered notice to you and posted the matter to 13-09-2023 for your appearance. So you are here by requested to appear before the Hon'ble Senior Civil Judge Court at Bhimavaram to answer the execution Petition on **13-09-2023** at **10-30** A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Senior Civil Judge, Bhimavaram)

Y.V. Narasimha Rao,
D. Willing Stone,
Advocates,
Bhimavaram,
West Godavari District

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
EP No. 25 of 2021
in
O.S No. 1177 of 2010

Between:
Kapil Chit Funds Pvt. Ltd
Vijayawada-2 Branch,
Rep. by It's Assistant Divisional Manager
... DHR
AND
Panjabi Mukesh Kumar and others
... JDRS

Notice to JDR No. 6,
Chatragadda Sudhakar, S/o. Babu Rao, Hindu, 50 years, Physical Education Teacher, ZP High School, Vuyyuru, Krishna District,
(JDR No. 6)

Please take notice that the above Execution Petition had filed for Attachment of your salary for recovery of EP amount and the Hon'ble Court ordered notice to you and posted the matter to 25-09-2023 for your appearance. So you are here by requested to appear before the Hon'ble 1st Additional Senior Civil Judge Court at Vijayawada to answer the execution Petition on **25-09-2023** at **10-30** A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble 1st Additional Senior Civil Judge, Vijayawada)

A.PRASOON KUMAR
Advocate,
D.No.25-104
Yanamalakuduru
Vijayawada-7

కోర్టు ప్రకటన

IN THE COURT OF THE 3rd ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S No.713 OF 2020
Between:
UNION BANK OF INDIA,
(Recently the Andhra Bank merged with Union Bank of India) Patamata Branch, Vijayawada, Rep by its Chief Manager.
..........Plaintiff
And
1) Smt.Ganapathi Satyaveni
2) Smt. Enapakurthi Sujatha
.........Defendants
To,
2.Smt Enapakurthi Sujatha w/o Rangarao, resident of D.No.73-4-26, Thota vari street, Patamata, Vijayawada, Krishna Dist-520007
. ...2nd Defendant

పై నెంబరు దావాలో వాది తనకు రావాలసిన బాకీ మొత్తంను రాబట్టు కొనుటకు ప్రతివాదులు అయిన మీ పై దావా దాఖలా చేసియున్నారు. కావున 2 ప్రతివాదికి అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు వారు నోటీసులు పంపిన తీసుకొనకుండా త్రిప్పిపంపిన కారణంగా మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.18-10-2023న వాయిదా వేసినారు. సదరు తేదిన ఉదయం గం॥ 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనియెడల మీ పరోక్షంగా తీర్మానం చేయగలరని తెలియజేయడమైనది.

(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 18-10-2023
ఇట్లు:- హూరున్నాసా బేగం
వాది తరపు న్యాయవాది
విజయవాడ-1. ఫోన్ :9848471048

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM XII ADDITIONAL DISTRICT COURT, VIJAYAWADA
M.V.O.P.No.116/2023

Between:
Yerramsetty Naga Durga Ram
...Petitioner
And
Golla Sivananda Babu and others
...Respondents

To
Golla Siva Nanda Babu **(R.1)**
S/o.Naga Raju,
Driver of Car AP 28 BQ 3835,
R/o. Plot No.181, Road No.10,
Venkateswara Nagar, Kuthbullapur Nagar,
Chintal, Hyderabad-500054.

Please take notice that the above named petitioner got filed the above O.P., for compensation against you and others and the same stands posted to 25-09-2023 for your appearance. therefore, you are hereby directed by this notice to attend before this court on the said date at 10.30 a.m., either in person or through your advocate to answer the claim. Else, the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)

sd/-GOLI NARASIMHA RAO,
GOLI RAMA DEVI,
ADVOCATES,
Door No.32-13/1-3,
ANJAIAH STREET,
NEAR SIVALAYAM,
MOGHALRAJPURAM,
VIJAYAWADA-10

BEFORE THE MOTAR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM XVI ADDITIONAL DISTRICT JUDGE COURT AT NANDIGAMA,NTR.DT.A.P.
MVOP NO.31/2022

BETWEEN:-
Kalaka Swarna Kumari and 3 others
....Petitioners
and
G.Venkateswarlu and 2 others
.....Respondents

To:1.G.venkateswarlu, S/o Venkataramulu, Hindu, Aged 39 years, D.No.3-130, Sc Colony, Ramireddipalli (V),Nandigama(M), NTR.Dt. Driver of the Crime Vehicle bearing No.AP39J0946. **...R1**
2.Shaik Mastan, S/o Jani Basha, D.No.76-8/7D, Gudiwada RamaRao Street, Vijayawada, Ntr.dt.-520012. **...R2**
Owner of the Crime Vehicle bearing No.AP.39J0946.

Please take notice that the above name Pettioners got filed the above petition. MVOP.31/2022. For compensation. Aganist you and another and same stands posted to 8-9-2023. For your apperance there. For you here by directed by this notice notice to attend. Before this court as the said date at 10.30 am. Either in person or through your advocate to answer the claim. Else the matter will be decided in your absance.

By order of the Court.

sd/- Bondlapati Ramkrishna, Bsc,LLB.
Advocate,
Nandigama.Ntr Dt.
cell No.9912731242.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT COURT JUDGE AT KHAMMAM.
E P NO : 417/2020 IN ARB NO: 358/2015

Between:
M/s Shriram city Union Finance Limited per Its Khammam-II Branch, Rep. by Its Authorized Signatory .....DHR
AND
KRUPAKAR VEERAVELLI & OTHERS
.....JDRS

JDR. NO.2) UDAY BHASKAR LINGALA, S/0 SAMUEL. AGE: 41 YEARS. OCC CSI.. PRIMARY SCHOOL GUNTUPALLI, IBRAHIMPATNAM, KRISHNA, R/0 H.NO: 22-11/2/3, GOLLAPUDI, SAIPURAM COLONY, LIC COLONY, KRISHNA(DIST). CELL NO: 9052172180.
JDR No.2) PRESENT WORKING ADDRESS OCC: HEAD MASTER, CST PRIMARY SCHOOL. GUNTUPALLY. IBRAHIMPATAM KRISHNA(D)
JDR. N0.3) CHENNAIAH GODA, S/O SUBBA CHENNAIAH, AGE: 53 YEARS, OCC. RECORD ASST, VIJAYAWADA. RIO H.NO. 51-1-298/1. GUNEDALA, KRISTUROJAPURAM, ARULNAGAR, KRISHNA DIST. CELL NO 8179963605 **JDR No 3)** PRESENT WORKING ADDRESS OCC RECORD ASST, BISHOP AZARAIAH HIGH SCHOOL. VIJAYAWADA-01, KRISHNA(D)

Where as DHR Company above E P for recovery of Award amount against both of you for relief of salary attachment warrant both of you, these to give you notice that both of you are to appear before this court in person or by a pleader on this 11th day of September 2023, At 10.30 A M to show cause why execution should not be granted.

(BY ORDER OF THE COURT)
Date: 6-9-2023

Sd/ KONA CHANDRASEKHAR,
Advocate
H.NO: 15-9.191, ROAD NO.12,
KAVIRAJ NAGAR, KHAMMAM(DT)

వర్గీకరణకు కృషి చేయాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ శ్రేణులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీ ఎస్ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 18వ తారీఖున నుంచి జరగ బోయే పార్లమెంటు సమావేశాల్లో ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ద్వారా ఎంపీ బాలశౌరికి విషయాన్ని తెలియజేసి 29 సంవత్సరాలుగా కొనసాగు తున్నా ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతు తెలియజేసి కేంద్రం పై ఒత్తిడి తీసుకువచ్చేవిధంగా కృషి చేయాలని కోరారు. వర్గీకరణ గురించి పార్లమెంటు సమావేశాల్లో ఎంపి బాలశౌరి తన గళమెత్తి వర్గీకరణ బిల్లు అమలు అయ్యే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గం కన్వీనర్ కలపాల వికాస్ మాదిగ, గన్నవరం నియోజక వర్గం కో

కన్వీనర్ పేటేటి కిషోర్ మాదిగ, ఐనంపూడి ఆశీర్వాదం మాదిగ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆటవిక రాజ్యం

- టిడిపి సీనియర్ నాయకులు కేశినేని చిన్ని

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తుందని టిడిపి సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రను అధికార వైసిపి అడుగడుగునా అడ్డుకుంటుందని అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం ప్రాంతంలో యువగళం పాదయాత్ర సందర్భంగా టిడిపి వారిని వాలంటీర్లు అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. టిడిపి అధ్యక్షులు నారాచంద్రబాబు, నారాలోకేష్‌పై రాష్ట్ర మంత్రులు నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషించినా కానీ పోలీసులు ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు నారాలోకేష్ చేస్తున్న పాదయాత్రను వైసిపి శ్రేణులు, అధికారులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నా రన్నారు. లోకేష్ పాదయాత్రను ఆపటం ఎవరి తరం కాదని అన్నారు. ఇప్పటికయినా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంతంగా పాదయాత్ర జరిగే విధంగా ప్రభుత్వం వాతావరణం కల్పించాలని కోరారు.

ప్రజాదరణ తట్టుకోలేకే దాడులు : టిడిపి

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : వైసీపీ అరాచకపాలనపై ప్రజలను చైతన్యపరచందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే వైసీపీ మూకలు దాడులు పాల్పడుతున్నాయని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్ర జరుగుతుండగా కవ్వింపు చర్యలకు పాల్పడటంతో మొదలైన వైసీపీ మూకల అరాచకాలు భీమవరంలో రాళ్లు, సోడాబాటిల్స్ విసిరేదాకా వచ్చాయన్నారు. పుంగనూరు, పులివెందుల తరహా దాడులను ప్రోత్సహిస్తోన్న వైసీపీ కి త్వరలోనే ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. వైసీపీ గూండాల దాడిలో టీడీపీ నేతలు, పోలీసులతో పాటు చిన్నపిల్లలు గాయపడిన విషయం తెలిసికూడా యువగళం వాలంటీర్లు, టీడీపీ నేతలపై కేసులు పెట్టడం చూస్తుంటే పోలీసు వ్యవస్థను ప్రజలు నమ్మకం కోల్పోయే పరిస్థితి ఉందన్నారు.

ఎంఎల్‌సికి సన్మానం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మున్సిపల్ వైస్ చైర్మన్ గా అవకాశం కల్పించిన ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు , ఎంఎల్సి మొండితోక అరుణ్ కుమార్ లకు జీవితాంతం రుణపడి ఉంటానని మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ (కిరణ్) అన్నారు. బుధవారం రాత్రి నందిగామ పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ ను ఇటీవల నందిగామ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా ఎన్నికైన 1 వ వార్డు కౌన్సిలర్ పాకాలపాటి కిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు 1 వ వార్డు ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్‌ను సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు . ఈ సందర్భంగా ఎంఎల్సి మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాంగబద్ధ పదవులలో, నామినేటెడ్ పదవులలో ఉన్నత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. నందిగామ మున్సిపాలిటీలో మొదటగా ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన మాడుగుల నాగరత్నమ్మకి, బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన ఓర్సు లక్ష్మి కి వైస్ చైర్మన్ లుగా అవకాశం కల్పించామన్నారు. అదేవిధంగా కో ఆప్షన్ సభ్యులుగా ఇద్దరు మైనారిటీలకు అవకాశం కల్పించామన్నారు.

మాడుగుల నాగరత్నమ్మ అకాల మరణానంతరం వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించవలసి రావడంతో ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి కూడా అవకాశం కల్పించాలనే సదుద్దేశంతో పాకాలపాటి కిరణ్‌కు అవకాశం కల్పించామన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఉన్నత పదవులు దక్కు తున్నాయని గుర్తించు కోవాలన్నారు. నందిగామ నియోజకవర్గంలో పలు గ్రామాల సర్పంచులు గా, వైస్ ఎంపీపీలుగా, జడ్పిటిసి గా ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి సముచిత అవకాశాలు కల్పించామని తెలిపారు. అనంతరం నందిగామ మున్సిపాలిటీ అభివద్ధికి అందరూ కలిసి సమన్వయంతో పనిచేయాలని వైస్ చైర్మన్ పాకాల పాటి కిరణ్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .

కిడ్నీ వ్యాధి బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మండలం హనుమాన్ నగర్‌లో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కొండపల్లి సత్యనారాయణ రెడ్డికి హనుమాన్ జంక్షన్ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ బుధవారం ఉదయం 5వేల రూపాయలు చెక్కును అందించారు. దీనికి సహాయంగా వైద్య ఖర్చు నిమిత్తం జిల్లా కోశాధికారి వడ్డీ రాజేశ్వరరావు 2000 రూపాయలు, మానవత సెక్రెటరీ, లయన్ కళ్ళేపల్లి నారాయణరావు 500 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాన వతా చైర్మన్ మారు బోయిన కోటేశ్వరరావు , సెక్రటరీ పాటోలు గణేష్ బాబు , నారగాని కొండలరావు, పివిఎస్

సాయం అందిస్తున్న దృశ్యం

చలం, జన్యావుల సత్యనారాయణ, చెక్క సుబ్బారావు , అక్కినేని రాఘవేంద్రరావు, దయాల ప్రభాకర్‌రావు, రేవిణిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

సహాయం అందజేస్తున్న శ్యామ్ కిషోర్ నాయుడు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : పంచాయతీ పరిధిలోని భారతీ ఆస్పటల్ సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో గహాలు దగ్ధమైన సూరగం నాగమల్లి కేసని కష్టకుమారి లకు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఒక్కొక్కరికి రూ. 5,000 చొప్పున పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం బాధితుల వద్దకు వెళ్లి వారిని పరామర్శించి బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్ను బాబురావు, కర్ర శాంతయ్య, బచ్చు శ్రీనివాసరావు, రేమాల శ్రీనివాసరావు, చెన్ను వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం తరహా వ్యవసాయ పద్ధతులతో రైతులకు ఆర్థికభారం తగ్గి 365 రోజులు ఆదాయం పొందవచ్చని డీపీఎం కె. పార్థసారథి సూచించారు. కె.సీతారాంపురంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఫార్మర్ సైంటిస్ట్ పూర్ణచంద్రరావు అనే రైతు 20 సెంట్ల విస్తీర్ణంలో ఏటీఎం తరహాలో సాగు చేస్తున్న పద్ధతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో కాం పౌండ్ బ్లాక్ విధానం గురించి వివరిస్తూ పరిచేను చుట్టూ మూడడుగుల వెడల్పు, ఎత్తులతో గట్టు ఏర్పాటు చేసుకుని వివిధ రకాల కూరగాయల విత్తనాలు నాటుకోవాలన్నారు. లేదా ప్రతి రైతు 20 సెంట్ల భూమిలో ఏటీఎం తరహా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తే ప్రతి రోజూ, ఆదాయం పొం దవచ్చన్నారు. దీని వల్ల రైతులకు ఆదాయ వనరుగా ఉంటూ అంతరపంటల సాగువల్ల ప్రధాన పంటకు అయ్యే ఖర్చుని కూడా రాబట్టుకోవచ్చని అందుకే ఏటీఎం విధానం విలువైందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎల్ఎ క్రిషి, మెంటార్ రామమోహనరెడ్డి, ప్రాంతీయ అధికారి ప్రకాష్, రాష్ట్ర అధికారి ప్రవీణ్, ఎడీపీఎం నాగలక్ష్మి, తదితరులతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా నాడు నేడు పనులు

ప్రజాశక్తి-పమిడిముక్కల : వీరంకిలాకు ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పమిడిముక్కల మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ 2 శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొదటివిడతలో మండలంలోని పమిడిముక్కల, అమ్మినావురం, మంటాడ, లంకపల్లి, చోరగుడి పాఠశాలల్లో పనులు పూర్తవుతున్నాయన్నారు. రెండో విడత పాఠశాలల్లో వీరంకులకు, పైడికొండలపాలెం, మంటాడ, హనుమంతపురం, పాఠశాలల్లో పనులు జరుగుతు న్నాయని తెలిపారు. అలాగే పాఠశాలలో తాగునీరు, రంగులు, టాయిలెట్స్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మధ్యాహ్నం భోజనం అన్ని పాఠశాల అమలు అవుతుంతరాచ పాఠశాల బయట పిల్లలు ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గురువులకు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక పెద్దఎరికిపాడులోని చరణ్ పబ్లిక్ స్కూల్లో మంగళవారం రాత్రి ఘనంగా గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. విద్యారంగంలో వివిధ సేవలందించిన పోతుకూరి సాంబశివరావు, రేపల్లె గణేష్, రావూరి కోటేశ్వరరావు, రంపాటి శ్రీకాంత్, వట్టెం ఉమామహేశ్వరావు, రేఖవల్లి జయలక్ష్మీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మాదాసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి సందడి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణాష్టమిని పురస్కరించుకుని మచిలీపట్నం జవ్వారుపేట సన్నాల వారి వీధి లో ఉన్నటువంటి శ్రీ కృష్ణ మందిరం నందు బుధవారం కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ ప్రతినిధి గడ్డం రాజు తెలిపారు.ప్రతి సంవత్సరం కులమతాలకతీతంగా శ్రీకృష్ణ మందిరం లో వేడుకలు నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారికి కుమార్ పూర్ణిమ దంపతులచే పూజాదికాలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాన్ని వితరణ గావించి అనంతరం భక్తి పాటలు, చిన్నారుల కోలాటం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని గడ్డంరాజు తెలిపారు.ఈ వేడుకలలో విజయ,ఇందిర, కుమారి,రజని, జ్యోతి,వాణి, పూర్ణిమ, వెంకటేశ్వరరావు కుమార్,సురేష్ భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుక వైభవంగా జరుపుకున్నారు. వివిధ సంస్థలు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుక నిర్వహించి చిన్ని కృష్ణుడు వేషాధారణ పోటీలు నిర్వహించి బహు మతులు అందజేశారు. ఉయ్యూరు ఇంగ్లీషు మీడియం స్కూల్లో కృష్ణాష్టమి పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో చిన్నికృష్ణుడు, గోపికల వేషాధారణ పోటీలు నిర్వహించి

హనుమాన్‌జంక్షన్‌లో...

స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు చిన్నారులకు బహుమతులు అందజేశారు. చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో బాల బాలికలు నేత్రపర్వం గావించారు. వీరమ్మతల్లి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి పండుగ జరిపి ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నికృష్ణుని వేషా ధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈ.కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎం. వి. లక్ష్మి ప్రసన్న ఆధ్వర్యం లోఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థుల గోపిక కృష్ణుని వేషధారణలో చూపరులను అలరించారు, చిన్నారులు ఉట్టి కొట్టి చక్కగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.జి.ఎం.అనిల్ కుమార్,ఆర్.ఐ. డి.సత్తి రెడ్డి, ప్రిన్సిపాల్ జి.ప్రవీణ్ కుమార్, జోనల్ కో ఆర్డినేటర్స్,జి లియోని, బి.సరళ అలీషా, అకాడెమిక్ డీన్ ఆర్. దుర్గ శంకర్ రావు ,వైస్ ప్రిన్సిపాల్ బి. హవీలా గ్రేస్,ఎం. వి.లక్ష్మి ప్రసన్న , ఏ.ఓ.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గత నెల రోజులుగా పశ్చిమ రైల్వేస్టేషన్ రోడ్డులో వీధిలైట్లు వెలగకపోవటంతో రాత్రి సమయంలో రైల్వేస్టేషన్ నుండి వన్‌టౌన్ పలు ప్రాంతాలకు వెళ్ళేవారు బ్లేడ్ బ్యాచ్ వారి ఆగడాలకు గురవుతున్నారని, వెంటనే విద్యుత్ శాఖాధికారులు దీనిపై దృష్టి పెట్టి వీధిలైట్లు వెలిగే విధంగా చూడాలని ఈనెల 3వ తేదీన 'ప్రజాశక్తి'లో "పశ్చిమ రైల్వే స్టేషన్ రోడ్లో వెలగని వీధి లైట్లు" అన్న వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో సంబంధిత వార్తకు స్పందించిన విద్యుత్ శాఖాధికారులు పశ్చిమ నియోజకవర్గంలోని 54వ డివిజన్ ప్రాంతంలోని వెలగని (54/187/58, 56, 54) మూడు విద్యుత్ స్తంభాల విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేసి లైట్లను పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో రాత్రి సమయంలో చీకటిగా ఉండే ప్రాంతాన్ని వెలుగులు తీసుకువచ్చిన ప్రజాశక్తికి స్థానిక ప్రజలు, రైల్వే స్టేషన్ నుంచి ఇళ్ళకు వెళ్లే పలువురు ప్రయాణీకులు కృతజ్ఞతలు తెలిపారు.

రియల్‌మీ సరికొత్త ఆవిష్కరణలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అత్యంత విశ్వసనీయ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ.. రియల్‌మీ నార్జో 60ఎక్స్ 5జీ, రియల్‌మీ బడ్స్ ఆవిష్కరించినట్లు సంస్థ ప్రతినిధి కె.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని సంస్థ షోరూంలో నూతన ఉత్పత్తుల పరిచయం జరిగింది. ఇవి 5జీ స్పీడ్ ఫ్రాంటియర్ యువత ఆకాంక్షలను తీర్చడానికి అంకితం చేయబడిందని, ఇది నెక్స్ట్-జెన్ టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా తన స్థానాన్ని పటిష్టం చేస్తుంది. అన్నారు. 'డేర్ టు లీప్' స్పిరిట్‌తో రెండు అద్భుతమైన ఉత్పత్తులను పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రియల్‌మీ నార్జో 60ఎక్స్ 5జీ, రియల్‌మీ బడ్స్ టీ300 రియల్‌మీ నార్జో సిరీస్ మా వినియోగదారులలో చాలా మందికి ఇష్టమైనవన్నారు. అత్యాధునిక సాంకేతికతను వినూత్న డిజైన్‌ను కలుపుకొని వినియోగదారులు తమ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని వ్యక్తపరుస్తూనే సాంకేతిక ధోరణులలో ముందంజలో ఉండేలా వారిని శక్తివంతం చేస్తుందన్నారు. ఈ 5జీ స్మార్ట్ ఫోన్‌లో స్పీడ్ ఫ్రాంటియర్ శక్తివంతమైన కెమెరా, ఫాస్ట్ ఛార్జింగ్, పెద్ద బ్యాటరీ, ఆకర్షించే డిజైన్, స్లిమ్ ఫారమ్ ఫ్యాక్టర్, సమర్థవంతమైన 5జీ చిప్‌సెట్, మల్టీ టాస్కింగ్ కోసం పుష్కలమైన ర్యామ్, నిల్వ సామర్థ్యాన్ని మిళితం చేస్తుందన్నారు. ఇది 50ఎంపీ ఏఐ కెమెరాను కలిగి ఉందన్నారు. వినియోగదారులు తమ సజనాత్మకతను పూర్తి స్థాయిలో ప్రదర్శించడానికి అనుమతిస్తుందని తెలిపారు.

స్కోడా కొత్త కార్లు విడుదల

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : టెస్టెడ్ కార్ల తయారీదారులైన స్కోడా ఆటో సంస్థ నుండి కుషాన్ ఒనిక్స్ ప్లస్, స్లావియా రెండు కొత్త కార్లను మార్కెట్లోకి విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధి కె.రాజేష్ తెలిపారు. స్కోడా ఆటో సంస్థ కార్యాలయంలో కార్లను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల కోసం ఎప్పటికపుడు నూతన కార్లను మార్కెట్లోకి తీసుకువస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రెండు వేరియంట్లలోనూ పండుగ ధర, ఆకర్షణీయమైన ఆఫర్లతో పాటు కొత్త ఎక్స్ఛేంజ్ సదుపాయం కూడా ఉందన్నారు. కుషాన్ ఒనిక్స్ ప్లస్ అన్ని కొత్త ఆరు 16 గ్రస్ అల్లాయ్‌లను, విండో క్రోమ్ గార్నిష్‌ను కలిగిఉందన్నారు. ఫ్రంట్ గ్రిల్ రిబ్స్, వెనుక ట్రంక్ గార్నిష్ ఇపుడు క్రోమోతో అందిస్తున్నట్లు తెలిపారు. కుషాన్ ఒనిక్స్ ప్లస్ ధర రూ.11.59 లక్షలు అన్నారు. ప్రత్యేకంగా క్యాండీ వైట్, కార్బన్ స్టీల్ రంగుల్లో అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటికే బుకింగ్స్ ప్రారంభమయ్యాయని తెలిపారు.

పలుచోట్ల కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కృష్ణాష్టమి పురస్కరించుకొని ఎనికేపాడులోని విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమానికి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ శేషశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీత గ్రంథాన్ని ఒక ఆధ్యాత్మిక గ్రంథంలా కాకుండా క్రమశిక్షణ కలిగిన మానవ జీవితానికి ఒక దిక్సూచిలా విద్యార్థులు భగవద్గీత సారాంశాన్ని అవపోసన పట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతి కార్యక్రమాలు ఉల్లాసంగా సాగాయి. రాధ, కష్ణుడు, గోప గోపికల వేషధారణతో విద్యార్థులు ప్రేక్షకులను ముగ్ధుల్ని చేశారు.

దుర్గగుడిలో...

మైలవరంలో...

పలువురు విద్యారంగ ప్రముఖులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.వి.ఎస్.ఎస్.ఎం. లక్ష్మి, ఉప ప్రధానోపాధ్యాయురాలు జి శైలజ తదితరులతో సహా అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గగుడిలో కృష్ణాష్టమి వేడుకలు

వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య, చింకా శ్రీనివాసరావు పాల్గొన్నారు. సాయంత్రం 6:30 గంటల నుండి 7 గంటల వరకు దేవస్థాన పురాణ పండితులచే ఉపన్యాసం జరిగింది. అనంతరం ఉట్టి కొట్టు వేడుకులు రాజగోపురం ముందు భాగమున గల ఖాళీ ప్రదేశం నందు నిర్వహించారు.

మైలవరం : కష్ణాష్టమి వేడుకలను బుధవారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వివేకానంద పాఠశాల ఎస్ఎస్‌కె, శ్రీ లీలావతి పబ్లిక్ పాఠశాలలో చిన్నారులకు శ్రీకష్ణ జన్మ వృత్తాంతం గురించి వివరించారు. చిన్నారులచే ఉట్టి కొట్టించారు. ఈ సందర్భంగా లీలావతి పబ్లిక్ స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడుత లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారతదేశ సంస్కతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్ లు, కరస్పాండెంట్ విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : పట్టణంలో శ్రీకష్ణ మందిరంలో బుధవారం ఘనంగా శ్రీ కష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా దేవాలయ ప్రాంగణంలో యాదవ కుటుంబీకులచే ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ తెలిపింది. అనంతరం శ్రీ కష్ణాష్టమిని పురస్కరించుకొని సంతాన వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం మరియు తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు దేవాలయంలో భక్తులు పోటెత్తారు.

కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు, గోపిక వేషధారణలో చిన్నారి

జగ్గయ్యపేటలో...

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ వారి ఆధ్వర్యంలో విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో గురుపూజోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ గురువు లేని విద్య ఏది లేదని ఒక డాక్టర్, పోలీస్, టీచర్, ఐఎఎస్, ఐపిఎస్, ఏ ఉద్యోగం చేయాలన్నా కూడా ఒక టీచర్ దగ్గర విద్య నేర్చుకున్న తర్వాతనే అని అన్నారు. అదేవిధంగా ప్రస్తుత సమాజ పరిస్థితులు టీచర్స్‌కు చాలా ఇబ్బందికరమైన వాతావరణం నెలకొందని టీచర్ వత్తి చాలా దయనీయమైన స్థితిలోకి మార్పులు వచ్చాయని తెలిపారు. ఈ మధ్యకాలం టీచర్స్ తో పని లేకుండా డిజిటల్స్‌తో పనిచేసేలా ఈ ప్రభుత్వాలు నెలకొల్పాలని చూస్తూ ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవుట ఫోర్సింగ్ జీతాలు రోజువారి కూలి కంటే తక్కువ ఉన్నాయని విస్మయం వ్యక్తం చేశారు. తల్లి తండ్రి, గురువు దైవం లాంటి టీచర్స్‌కు రాబోయే రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రభుత్వాలు సహకరించాలని లైన్స్ సభ్యులు వై.గాంధీ విజ్ఞప్తి చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు. డాక్టర్ చిన్న, కార్యదర్శి డాక్టర్ కె.లక్ష్మీకాంత్, వీరు, శ్యామల, రాజేశ్వరి, శ్రీనివాస్, కె.దుర్గారావు ఉపాధ్యాయులను. ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో తొర్లికొండ సీతారామయ్య. మారం సత్యనారాయణ నూకవరపు సాంబశివరావు. ఎం.హనుమాన్ రాజు. చల్ల గాంధీ. ఎం వెంకటేశ్వరరావు. ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దశ్యం

క్రికెట్‌పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కోకా కోలా కంపెనీకి చెందిన ఐకానిక్ స్వదేశీ బ్రాండ్ థమ్స్ అప్ ఉరా, ఇండియా మచా అనే ప్రచారం ద్వారా ఐసీసీ పురుషుల క్రికెట్‌కు ప్రచారం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి కె.రామ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ పట్ల ఆసక్తి రోజు రోజుకూపెరుగుతుందని, రానున్న ప్రపంచ కప్ క్రికెట్‌లో ఎప్పటికపుడు అప్‌డేట్ తెలియచేయడంలో భాగంగా విస్తృత ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో థమ్ అప్ ఉరా పేరుతో సరికొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రానున్న కాలంలో క్రికెట్ ప్రచారానికి మరింత పెద్ద స్థాయిలో ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు.

నాకు తెలియకుండానే పక్కా గృహం

సిమెంటు తీసుకున్నట్లూ రుజువు చూపుతున్న గృహనిర్మాణ శాఖాధికారులు : రోశమ్మ

ప్రజాశక్తి - గంపలగూడెం: 'నాకు తెలియకుండానే ప్రభుత్వ పక్కా గృహం నాకు గృహం మంజూరయ్యింది. నాకు తెలియకుండానే దాని ద్వారా 10 కట్టలు సిమెంట్ కూడా తీసుకున్నానంట' అంటూ ఓ మహిళ వాపోతోంది. వివరాలు చూస్తే... గంపలగూడెం గ్రామానికి చెందిన రోశమ్మకు 2005-2006 సంవత్సరంలోనే పక్కా గృహం మంజూరైందని, అందుకు గాను ఆమెకు 10 కట్టలు సిమెంటు కూడా అందిందని దానికి సంబంధించిన ఐడి 060811206 W10245గా, గృహ నిర్మాణ శాఖాధికారులు చెబుతున్నారు. అయితే ఆ విషయం విన్న రోశమ్మ అవాక్కయ్యింది. అసలు తాను పక్కా గృహం అడగలేదని, ఎలాంటి సిమెంట్ తీసుకోలేదని చెబుతుంది. ఇదే విషయం గృహ నిర్మాణ శాఖాధికారులకు తెలియజేసింది. ఇటీవల తన భర్త మృతిచెందాడని తన ఇద్దరు పిల్లలతో కూలి చేసుకుంటూ జీవిస్తున్నానని రోశమ్మ చెబుతోంది. ఈ నేపథ్యంలో గృహం కోసం అధికారులను కలిసానని చెప్పింది. ఇప్పుడు అది మంజూరైనట్లు నగదు, మెటీరియల్ కూడా తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారని వాపోతోంది. సిమెంట్ కట్టలు తీసుకున్నట్లు ఉన్న సొమ్మును చెల్లిస్తానని ఇల్లు మంజూరయ్యేలా చూడాలని అధికారులను కోరింది. అది తమ చేతుల్లో లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సంబంధిత అధికారుల నుండి ఉత్తర్వులు వస్తేనే తప్ప ఏమీ చేయలేమని చేతులెత్తేశారు. ఈ విషయమై ఆ శాఖ డిఇ విజయ భాస్కర్ రాజును ప్రజాశక్తి వివరణ కోరగా, సదరు విషయాలను ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా తెలియజేస్తానని, ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వస్తే నూతనంగా గహాలు మంజూరు చేయించే కార్యక్రమం చేపడతామని తెలిపారు.

రోశమ్మ

సమతుల్య ఆహారంతో ఆరోగ్యకర జీవనం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : శరీర ఎదుగుదల, రోగ నిరోధకశక్తిని పెంపొందించానికి అవసరమైన పోషకాలను అందించే సమతుల్య ఆహారం ప్రతి ఒక్కరూ తీసుకోవాలని హెర్బాలైఫ్ ఫిట్‌నెస్ ఎడ్యుకేషన్ వైస ప్రెసిడెంట్ సమంతా క్లేటాన్ తెలిపారు. జాతీయ పోషకాహార వారోత్సవం సందర్భంగా సమతుల్య ఆహారంపై అవగాహనా సదస్సు బుధవారం నగరంలో జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువులు కలిగిన ఆహారంపై అవగాహన పెంచుకోవకాలని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి ఆరోగ్యకరమైన ఆహారం ఎంతో అవసరమని అన్నారు. శారీరక శ్రేయస్సుతో పాటు మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య కరమైన శరీరాన్ని నిర్వహించడానికి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలన్నారు. సమతుల్య ఆహారం, మానసిక ఆరోగ్యం గురించి తెలుసుకోవాలని సూచించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.